క్లుప్తంగా

దాతలు ఆదుకోవాలి



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని కె.బుడుగుంటపల్లె పంచాయతీ సమతానగర్‌కు చెందిన దట్టం హరిబాబు(35)కు రెండేళ్ల క్రితం కాలు, చేయి పడిపోయింది. అప్పటినుంచి తన అమ్మ కూలీనాలి చేసుకుని తనను పోషిస్తోంది. దయవుంచి దాతలు ఎవరైనా ఉంటే ముందుకు వచ్చి సహాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు. అలాగే ప్రభుత్వం నుంచి పింఛన్ వచ్చేటట్టు చేయాలని విన్నవించాడు. కోడూరు ఆటో యూనియన్ వారు హరిబాబు కుటుంబానికి నిత్యావసర సరుకులను అందజేశారు.

పనులు నాణ్యతగా చేయండి



పనులను పరిశీలిస్తున్న గడికోట మోహన్‌రెడ్డి

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల గ్రామం దూదేకులపల్లెలో ఇటీవల చేపట్టిన కాలువ నిర్మాణపు పనులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువ నిర్మాణాన్ని నాణ్యతగా, త్వరగతిన పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. గ్రామస్తులతో కలిసి గ్రామ సమస్యలపై చర్చించారు. అనంతరం గ్రామస్తుడు ఖాసీం మనుమరాలు కేశకండన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.

అక్రమ అరెస్టులు తగవు

రాయచోటి అర్బన్ : సమస్యల పరిష్కారం కోసం చలో తిరుపతికి వెళ్తారన్న అనుమానంతో పోలీసులు విద్యుత్ ఉద్యోగులను ముందస్తుగా అక్రమంగా అరెస్టు చేయడం తగదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 7వ తేదీ విజయవాడలో నిర్వహించనున్న ధర్నాకు తరలివెళతారనే కారణంతో రైతు నేతలు, రైతులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకోవడం దారుణమన్నారు. ఆందోళనకు వెళ్లకూడదంటూ బెదిరించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా ఉద్యమిస్తున్న వారిని పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం అన్యాయమన్నారు. వెంటనే వారిని విడుదల చేయాలంటూ ఆయన డిమాండ్ చేశారు.

పుంగనూరు విధ్వంసానికి బాబుదే బాధ్యత

రామాపురం : పుంగానూరు ఘర్షణ తెలుగుదేశం అధినాయకుడు చంద్రబాబునాయుడు బాధ్యత వహించాలని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి షేక్ జాకీర్ హుస్సేన్ అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రెచ్చగొట్టే ప్రసంగం వల్లే ఘర్షణ వాతావరణం మొదలైందని, తెలుగుదేశం కార్యకర్తలు పోలీసులపై ఘర్షణకు దిగడం, రాళ్లు రువ్వడం బాధాకరమన్నారు. చంద్రబాబు తన స్థాయి మరిచి వాడిన భాషను తప్పుబట్టారు. రాజకీయాల్లో ఓర్పు, సహనం ఉండాలని అవి చంద్రబాబుకు ముసలి వయసులో లోపించాయని అందుకే విద్వేషాలను రెచ్చగొట్టి అల్లర్లను సృష్టిస్తున్నాడని తెలియజేశారు. ఇప్పటి నుంచైనా ప్రతిపక్ష నాయకుడు తన పంథాను మార్చుకోవాలని హితవు పలికారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

వీరబల్లి (రాయచోటి టౌన్) : మానవ అక్రమ రవాణాను అరికట్టాలని వీఆర్‌డీఎస్ సురేంద్రా రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వీరబల్లె మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హ్యూమన్ చైన్ లింక్ ద్వారా మనుషులను అక్రమ రవాణా, బానిసత్వం వంటి అంశాలపై వివరించారు. ఎందరో అమాయకులు ఈ అక్రమ రవాణా ద్వారా తమ జీవితాలను నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై హెల్ప్‌లైన్ 1098కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కల్యాణి, స్వాతి, రాధ తదితరులు పాల్గొన్నారు.

భూమనను కలిసిన పంజం

రైల్వేకోడూరు : తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నియమితులైన సందర్భంగా తిరుపతిలోని ఆయన స్వగృహంలో ఆదివారం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భూమనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సత్కరించారు.

మొబైల్ ఫోన్ అప్పగింత

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె టౌన్‌లోని ఎస్‌బీఐ కుర్నూతల బ్రాంచ్ సమీపంలో ఆదివారం ఉదయం ఓ వ్యక్తి మొబైల్ ఫోన్ పొరపాటున పోగొట్టుకున్నాడు. కాగా ఆ మొబైల్ ఫోన్ ఉపాధ్యాయుడు వేమిరెడ్డి సుబ్బారెడ్డికి దొరకడంతో ఆయన లక్కిరెడ్డిపల్లె మానవత సభ్యులు వేమిరెడ్డి రాజారెడ్డి, ఆర్‌ఎంపీ కృష్ణయ్యలతో కలిసి విచారించారు. మొబైల్ ఫోన్ రాళ్లుకొడుతూ జీవనం సాగించే సంజీవ్ అనే వ్యక్తికి చెందినదిగా గుర్తించారు. అనంతరం సంజీవ కుటుంబ సభ్యులకు కాల్ చేసి ఫోన్‌ను అందజేశారు.

పేదల ఆరోగ్యానికి భరోసానిచ్చేలా..

- ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో 16 మంది వైద్య నిపుణులు
- శరవేగంగా జరుగుతున్న 100 పడకల నిర్మాణపు పనులు
- కార్పొరేట్ ఆస్పత్రిని తలదన్నుతున్న రాజంపేట సర్కారీ దావాఖానా



రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రి

రాజంపేట టౌన్ : గతంలో ఏదైనా చిన్న జబ్బు చేసినా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లేందుకు పేద రోగులు సైతం వెనుకంజ వేసేవారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రి రూపురేఖలు మారిపోయాయి. ఆస్పత్రిని విస్తరించారు. యాభై పడకలు ఉన్న ఆసుపత్రిని నాడు – నేడు కింద వంద పడకల ఆసుపత్రిగా రూపాంతరం చెందేందుకు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇదిలావుంటే వివిధ జబ్బులు, ఆరోగ్య సమస్యలకు సంబంధించి ప్రతి రోజు ఆరు వందల మందికి పైగా రోగులు ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. అలాగే 35 నుంచి 40 మంది ఇన్ పేషెంట్లకు వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారు. ఒక నెలలో దాదాపు 60 మందికి పైగా గర్భిణులకు సిజేరియన్, సాధారణ కాన్పులు జరుగుతున్నాయి. అలాగే దాదాపు 25 మందికి వివిధ జబ్బులకు సంబంధించి వైద్యులు ఆపరేషన్లు చేస్తున్నారు. పేద రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం తీసుకున్న చర్యలకు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్యనే చిన్నపాటి ఉదాహరణగా చెప్పవచ్చు.

అందుబాటులో స్పెషలిస్ట్ డాక్టర్లు

కాలానుగుణంలో వచ్చిన మార్పుల వల్ల మనిషి వివిధ రకాల జబ్బుల బారీన పడుతున్నాడు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య నిపుణులు అతి తక్కువగా ఉండేవారు. ఈ కారణంగా వయస్సు రీత్యా, వాతావరణంలో వచ్చిన మార్పుల దృష్ట్యా మనిషి కొన్ని జబ్బుల బారీన పడుతుంటాడు. అలాంటి సమయంలో రోగులు స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్యం చేయించుకునేందుకు కడప, తిరుపతి వంటి పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవి. అయితే ఇది పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఖర్చుతో కూడుకున్నదైనందున కొంత మంది అప్పు చేసి వైద్యం చేయించుకునేవారు. మరికొంత మంది స్థానికంగా ఉన్న వైద్యులను సంప్రదించి తాత్కాలిక ఉపశమనం పొందేందుకు మాత్రలను వాడేవారు. అయితే ఇప్పుడు రాజంపేట పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు అలాంటి కష్టాలు పూర్తిగా తప్పాయి. రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వివిధ రకాల జబ్బులకు వైద్యం చేసేందుకు 16 మంది వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారు. ఈ కారణంగానే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పవచ్చు. సాధారణ జబ్బులతో పాటు ఆర్థో, చిల్డ్రన్, కంటి, చర్మ, గైనకాలజీ, మొలలు, దంత తదితర వైద్య నిపుణులతో పాటు వివిధ రకాల సర్జరీలు సైతం ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులు చేస్తున్నారు.

వేల ఖర్చుతో కూడుకున్న ఆపరేషన్లు సైతం....

ప్రైవేట్ హాస్పిటల్స్‌లో వేల రూపాయిల ఖర్చులతో చేసే ఆపరేషన్లను సైతం ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులు చేస్తున్నారు. ప్రధానంగా గర్భిణులకు సిజేరియన్‌లు, హెర్నియా, వరబీజం వంటి ఆపరేషన్లు నిత్యం చేస్తున్నారు. సిజేరియన్‌కు కొన్ని ప్రైవేట్ ఆసుపత్రిలో రూ.50 వేల వరకు ఖర్చవుతుండగా, హెర్నియాకు రూ.40 వేలు, వరబీజం ఆపరేషన్‌కు రూ.25 వేల వరకు ఖర్చవుతుంది. ఈ ఆపరేషన్లతో పాటు ఎముకలు విరిగిన వారికి పిండికట్టు కట్టడం, మోకాళ్ల అరుగుదలకు సంబంధించి హీనోకార్టిన్ అనే ఇంజెక్షన్ కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉంది. ఇదే ఇంజక్షన్ బయట వేయించుకోవాలంటే మూడువేల రూపాయలకు పైగా ఖర్చవుతుంది. పుట్టిన వెంటనే పిల్లలకు సంక్రమించే కామెర్లుకు సైతం అత్యాధునిక పరికరాలతో వైద్యం అందించే సౌకర్యం కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకురావడం పేదల ఆరోగ్య స్థితిగతుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోంది.

20 వేల మందికి కంటి అద్దాల పంపిణీ

ముఖ్యమంత్రి ఐ కేంద్రం ద్వారా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి చూపు సమస్య ఉన్న రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కంటి చూపు తక్కువ ఉన్న వారికి ఈ పథకం ద్వారా ఉచితంగా అద్దాలను సైతం ప్రభుత్వం అందజేస్తోంది. వైఎస్ జగన్ సీఎం అయ్యాక 20 వేల మంది పైగా చికిత్స అనంతరం కంటి అద్దాలను పొందారు.



పురిటిబిడ్డల కోసం ఆస్పత్రిలోని కాన్పుల వార్డులో ఏర్పాటు చేసిన ఇంక్యుబేటర్స్

నావల్ల అయ్యేది కాదు



మాది నందలూరు మండలం పొత్తపి. కొంత కాలంగా హెర్నియా వ్యాధితో బాధపడుతున్నాను. ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించుకుంటే ఆపరేషన్ చేయాలని, అందుకు రూ. 40 వేలు ఖర్చవుతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో హెర్నియాకు ఆపరేషన్ చేస్తారని తెలిసింది. ఇక్కడికి వచ్చి ఆపరేషన్ చేయించుకున్నా. ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చివుంటే నావల్ల అయ్యేది కాదు. – నరసింహులు, పొత్తపి, నందలూరు

పేదల పాలిట దేవుడు జగన్



వరబీజం సమస్య వల్ల ఆపరేషన్ చేయించుకునేందుకు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాను. ఒకప్పటి ప్రభుత్వ ఆసుపత్రిని ఇప్పటి ఆసుపత్రిని చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోంది. గతంలో వరబీజానికి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ చేసే వారు కాదు. జగన్ సీఎం అయ్యాక ఇలాంటి ఆపరేషన్లు కూడా చేస్తున్నారు. మాలాంటి పేదోళ్లకు జగన్ దేవుడిలాంటి వారు. – నారాయణ, బలిజపల్లె, రాజంపేట

సద్వినియోగం చేసుకోండి



ముఖ్యంగా పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అనేక వైద్య సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. అందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రిలో అనేక రకాల వ్యాధులు, జబ్బులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. ఈ అవకాశాన్ని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం. – డాక్టర్ పి.వి. నాగేశ్వరరాజు, ఆసుపత్రి సూపరింటెండెంట్, రాజంపేట

ఆర్థికసాయం అందజేత



లీలావతమ్మకు చెక్కును ఇస్తున్న ముక్కా వరలక్ష్మి

ఓబులవారిపల్లె : ఇటీవల చిన్నఓరంపాడు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఎస్ఆర్ లీలావతమ్మకు ఆదివారం ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ. 50 వేలు చెక్కును ముక్కా వరలక్ష్మి అందించారు. ప్రమాదంలో లీలావతమ్మ భర్త మరణించగా ఈమె తలకు గాయామైందనే విషయం తెలుసుకొని ఫౌండేషన్ ద్వారా ఆర్థికసాయం అందించినట్టు వరలక్ష్మి తెలిపారు. లీలావతమ్మ, భజనానంద ఆశ్రమ బృందం వారు ముక్కా వరలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొమ్మూరు శ్రీనివాసులు రెడ్డి, మల్లీశ్వరి, శివారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రాజమ్మ, హరినారాయణ, నరసింహులు, నీలమ్మ, శ్యామల, ఉమ తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలిలో..

చిట్వేలి : ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న కెఎస్ అగ్రహారానికి చెందిన సన్నికి ఆదివారం ముక్కా రూపానందరెడ్డి ట్రస్టు అధినేత ముక్కా రూపానందరెడ్డి రూ. 25 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ మేరకు ఆదివారం ఓబులవారిపల్లెలో జరిగిన కార్యక్రమంలో బాధితుడి బంధువు పెంచలయ్యకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వేణుగోపాల్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, తల్లెం భరత్ కుమార్ రెడ్డి, విష్ణువర్దన్ రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలవండి

చిట్వేలి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని ఆదుకొని రైతులను బ్రతికించాలని రాష్ట్ర రైతు సంఘం నాయకుడు మలిశెట్టి జతిన్ విజ్ఞప్తి చేశారు. వెంకట్రాజుపల్లెలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో 50 శాతం మంది వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి చెరువులకు నీరు అందించి రైతులకు అండగా నిలవాలన్నారు.

మాండవ్య నది శుద్ధీకరణకు చర్యలు



నాలాను జేసీబీతో శుభ్రం చేస్తున్న దృశ్యం

రాయచోటి : ముళ్ల పొదలు, మురికి నీటిగుంతలు, దుర్వాసనతో నిండి దోమల ఉత్పత్తికి నిలయంగా మారిన మాండవ్యనది పరిశుభ్రతకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆదేశాలతో మునిసిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. పాత రాయచోటి పైభాగంలోని థియేటర్ల వద్ద ఉన్న చెక్‌డ్యాం నుంచి మాసాపేట సమీపంలోని హై లెవెల్ వంతెన వరకు ఉన్న మాండవ్య నదిని ముళ్లపొదలు కప్పివేశాయి. నదికి ఇరువైపులా ఉన్న మురికినీటి కాలువలు సైతం మట్టితో నిండిపోయి సమీప ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు ముందుకు కదలకుండా ఎక్కడపడితే అక్కడ నదిలోనే నిలిచి చిన్నపాటి కుంటలను తలపించేలా నీరు నిలిచిపోయింది. ఫలితంగా రాయచోటి – పాత రాయచోటి మధ్యన ఉన్న నదిలో ఉత్పత్తి అవుతున్న దోమల బెడద ఆ ప్రాంత ప్రజలను రోగాలబారిన పడేస్తోంది. ముఖ్యంగా వర్షాకాల పరిస్థితుల దృష్ట్యా నది ఉధృతంగా ప్రవహిస్తే సమీప ప్రాంతాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నది పరివాహక ప్రాంతాలలో పర్యటించిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి దృష్టికి స్థానికులు సమస్యలను వివరించారు. స్థానికుల విన్నపం మేరకు మాండవ్య నదిని మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, కమిషనర్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. వెంటనే కిలోమీటర్ దూరం వరకు ఉన్న ముళ్లపదలను పూర్తిగా తొలగించి నీటినిల్వను లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని శ్రీకాంత్‌రెడ్డి మునిసిపల్ చైర్మన్, కమిషనర్లకు సూచించారు. దీంతో కిలోమీటర్ పొడవున నదిలో ఏపుగా పెరిగిన కంపచెట్లు పిచ్చి మొక్కలను జేసీబీలతో తొలగించారు. నదికి ఇరువైపులా ఉన్న కాలువలలోని మట్టిని కూడా తొలగించి మురికినీటి ప్రవాహాన్ని నదిలోకి రానివ్వకుండా చర్యలు తీసుకున్నారు. పది రోజుల పాటు చేపట్టిన పనులను మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా పర్యవేక్షిస్తూ వచ్చారు. పనులు పూర్తి కావడంతో మాండవ్యనది పరిశుభ్రంగా మారి వచ్చిన నీరు వచ్చినట్లుగా ముందుకు కదిలిపోతుంది. దీంతో స్థానికులు ఎమ్మెల్యే పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా గత తెలుగుదేశం ప్రభుత్వంలో మాండవ్య నది నీరు – చెట్టు పనుల కింద రూ.1.50 కోట్లను కేటాయించిన ఎటువంటి అభివృద్ధి కనపించలేదు. నేడు కేవలం రూ. 10 లక్షలతో మాండవ్య నది శుద్ధీకరణకు చర్యలు చేస్తుండటంతో గత ప్రభుత్వంలోని నాయకులు చేసిన భారీ దోపిడీని ఇక్కడి స్థానికులు గుర్తు చేసుకుని అవాక్కవుతున్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చింతరాజుపల్లి పంచాయతీ కొటికవారిపల్లెలో వెలసిన శ్రీ అనుపులమ్మ అమ్మవారి జాతర సందర్భంగా బండలాగుడు పోటీలను నిర్వహించారు. పోటీలను ఆదివారం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. ముందుగా మేడాను చింతరాజుపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డె రమణ నాయుడు ఘన స్వాగతం పలికి, సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. రసవత్తంగా జరిగిన బండలాగుడు పోటీలలో పాల్గొన్న 5 జతల ఎడ్లలో విజేతలుగా నిలిచిన వారి వివరాలు అనంతపురం జిల్లా తాడిపత్రి టౌన్‌కు చెందిన రమేష్ బాబు యాదవ్ ఎడ్లు 2451.07 మీటర్లు లాగి మొదటి బహుమతిని గెలుచుకోగా వారికి మరుగుడుపల్లికి చెందిన ఎల్.సుబ్బరాయుడు, గంగులయ్య, ఆలమ రామలక్షమ్మలు కలిసి రూ. 30 వేలు అందజేశారు. కడప జిల్లా పోతిరెడ్డి పల్లికి చెందిన మూలె ప్రసాద్‌రెడ్డి ఎడ్లు 2100 మీట్లరు లాగి రెండవ స్థానంలో నిలువగా అమ్మోరుపల్లికి చెందిన దాసరి కత్రయ్య, ఎర్రయ్యలు రూ. 20 వేలు అందజేశారు. కడప జిల్లా జంగంపల్లెకు చెందిన పుత్తా నాగసుబ్బారెడ్డి ఎడ్లు 1953.09 మీటర్లు లాగి మూడవ స్థానంలో నిలిచారు. కొటికవారిపల్లెకు చెందిన రమేష్ నాయుడు రూ. 12 వేలు అందజేశారు. కడప జిల్లా యర్రగుంట్లకు చెందిన సంగటి శృతి ప్రియ ఎడ్లు 1800 మీటర్లు లాగి నాలుగవ స్థానంలో నిలువగా వీరికి కొటికవారిపల్లెకు చెందిన గోర్ల వెంకట సుబ్బమ్మ రూ. 8 వేలు అందజేశారు. చివరగా కడప జిల్లా కొత్తపల్లెకు చెందిన పూల రమణయ్య ఎడ్లు 637 మీటర్లు లాగి ఆఖరి స్థానంలో నిలిచారు. వీరికి ప్రోత్సాహ బహుమతి కింది కొటికవారిపల్లెకు చెందిన శివకుమార్ నాయుడు రూ. 6 వేలు అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, భక్తులు, నిర్వహకులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

గురిగింజకుంటలో వైఎస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీను సందర్శించిన ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



క్రీడాకారులకు ట్రోఫీలను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డిలు

సంబేపల్లె : యువత విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గురిగింజకుంట పంచాయతీ మల్లూరువాండ్లపల్లె సమీపంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్దన్‌రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఫైనల్ మ్యాచ్‌ను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన రాయచోటిలో అక్టోబర్ నెలకు క్రికెట్ స్టేడియం పనులు పూర్తి చేస్తామని తెలిపారు. రాయచోటి ప్రాంత క్రీడాకారులు చక్కని ప్రదర్శన కనబరిచి గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఎదగాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమేనని క్రీడాకారులంతా క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని విష్ణువర్దన్‌రెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రఘునాథరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, ఎంపీటీసీ శ్రీధర్‌రెడ్డి, అన్నారెడ్డి, గున్నికుంట్ల సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, ద్వారకనాథరెడ్డి, అమరనాథరెడ్డి, రమణారెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజర్స్, క్రీడాకారులు పాల్గొన్నారు. కాగా టోర్నీ విజేతగా దిన్నెపల్లె తెలుగు వారియర్స్ జట్టు నిలువగా అదే గ్రామానికి చెందిన మరో జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేతలకు రూ.50 రన్నర్స్‌కు రూ.30 వేల రూపాయలు బహుమతులతో పాటు షీల్డ్‌లను ఎమ్మెల్యే అందజేశారు.

ఆర్‌యూబీని వెంటనే పూర్తి చేయాలి

రాజంపేట టౌన్ : రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని ఆర్‌యూబీ సాధన సమితి ప్రతినిధి చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. ఆర్‌యూబీని త్వరితగతిన పూర్తి చేయాలన్న డిమాండ్‌తో ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు, అసంఘటిత కార్మికులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌కు అవతలి వైపు ప్రభుత్వ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు, కేంద్రీయ విద్యాలయం ఉన్నాయని, ఆ విద్యా సంస్థలకు వెళ్లే విద్యార్థులు సైకిళ్లపై ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా వెళుతున్నప్పుడు ఇబ్బందులతోపాటు ప్రమాదాల బారీన పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఆర్‌యూబీ నిర్మాణం పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అ సంఘటిత కార్మికులు పగడి సుబ్బరాయుడు, సుబ్రమణ్యంరెడ్డి, రమణ, జిలానీ, శంకరయ్య, తోట హరి, కాలేషా పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్‌యూబీ సాధన సమితి నాయకులు

ఉపాధ్యాయులను వేధించడం తగదు

రాయచోటి టౌన్ : అధికారులు ఉపాధ్యాయులను వేధించడం తగదని పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ కె. శ్రీనివాసరాజు పేర్కొన్నారు. ఆదివారం రాయచోటి డైట్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 117 జీఓ ప్రకారం పదోన్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు గత రెండు నెలలుగా జీతాలు అందలేదన్నారు. ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్రస్థాయి అధికారులను ప్రశ్నిండచం వలన ఉపాధ్యాయులపై లేనిపోని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉపాధ్యాయులందరూ సకాలంలోనే పాఠశాలలకు హాజరవుతున్నారన్నారు. కానీ పాఠశాలల్లో నెట్‌వర్క్ వలన, సర్వర్లు పని చేయకపోవడం వలన ముఖఆధారిత హాజరు సరైన టైంలో పడటం లేదని తెలిపారు. 95 శాతం ఉపాధ్యాయులు హాజరు వేస్తున్నారని కొన్ని సందర్భాలలో మాత్రమే కొందరు సాంకేతిక సమస్యల వలన హాజరు పడటం లేదని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలోని పాఠశాలలకు రవాణా సౌకర్యాలు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రాష్ట్ర బాధ్యులు రమణ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తౌఫిక్, నరసింహారెడ్డి, రెడ్డెన్న, ఓబుల్ రెడ్డి, కులశేఖర్‌రెడ్డి, రవీంద్ర రాజు, నాగరాజ నాయక్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు సౌకర్యాల కల్పనే ప్రాధాన్యత

రామాపురం : ఆస్పత్రికి వచ్చే రోగులకు అవసరమయ్యే సౌకర్యాలను కల్పించడమే ప్రాధాన్యత అని జెడ్పీటీసీ వెంకటరమణ, సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, గుత్తేదారుడు బలరాంరెడ్డిలు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆసుపత్రి పరిధిలో రూ.50 లక్షలతో నిర్మించనున్న మెడికల్ ల్యాబ్ భవన నిర్మాణానికి వారు భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ ఆసుపత్రికి అన్ని వసతులు ఉన్నాయన్నారు. నిత్యం రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. రోగ నిర్ధారణ కోసం ల్యాబ్ సౌకర్యం లేకపోవడంతో నూతన ల్యాబ్ భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌ను తెలియజేసి ప్రత్యేక నిధులు మంజూరు చేయించడం హర్షనీయమన్నారు. ఈ ల్యాబ్ ఏర్పాటుతో వ్యాధులకు సంబంధించిన పరీక్షలకు దూర ప్రాంతాలకు వెళ్లకుండా పరీక్షలు ఆస్పత్రిలోనే నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కర్లపు విశ్వనాథరెడ్డి, మాజీ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, ప్రసాద్‌రాజు, సూర్యనారాయణరెడ్డి, ఆసుప్రతి సిబ్బంది పాల్గొన్నారు.

చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



చుక్కలభూములకు హక్కు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్, ఆర్డీఓలు

రాజంపేట : చుక్కల భూముల చిక్కులను తప్పించి వారికి అన్ని రకాల హక్కులను కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. శనివారం రాజంపేట ఆర్డీఓ సభా భవనంలో చుక్కల భూములున్న రైతులకు హక్కుల పత్రాలను వారు అందజేసి మాట్లాడారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా చుక్కల భూములున్న రైతులకు మేలు చేసే విధంగా నిర్ణయాలు తీసుకున్నారన్నారు. అందుకే ముఖ్యమంత్రి రైతు బాంధవుడయ్యారన్నారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసిన ప్రభుత్వం తమదేనని తెలియపరిచారు. ఆర్డీఓ జి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ భూముల సమస్యలకు సర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తోందన్నారు. కొన్నేళ్ల సమస్యకు పరిష్కార మార్గాలను చూపుతూ రైతుల కళ్లలో సంతోషాలను నింపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, జెడ్పీటీసీలు దాసరి పెంచలయ్య, గడికోట ఉషాసుబ్బారెడ్డి, కౌన్సిలర్ పసుపులేటి సుధాకర్, తహసీల్దారు సుబ్రమణ్యంరెడ్డి, సర్వేయరు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా అతిరాల గుట్టపై నివసిస్తున్న ముంపువాసులు తమకు భూములు ఇవ్వలేదని, అక్కడే భూమి ఉందని, ఆ భూములు తమకే ఇవ్వాలని ఎమ్మెల్యే మేడా జెడ్పీ చైర్మన్‌కు విన్నివించారు. విషయాన్ని పరిశీలించి న్యాయం చేస్తానని ఆయనకు తెలియజేశారు. అనంతరం రాజంపేట డివిజన్‌లో తొమ్మిది మండలాలకు సంబంధించి 316 మందికి చుక్కల భూములకు సంబంధించి 4405 ఎకరాలకు హక్కు పత్రాలను మంజూరైనట్టు ఆర్డీఓ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణమంతా వేపాకులతో శుద్ధి చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి భక్తుల దర్శన అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మ దేవత ఆలయం ఆదివారం వేలాది మంది భక్తులతో కిక్కిరిసింది. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. ఆలయ చైర్మన్ సామాన్ నరసింహారెడ్డి, ఈఓ రవీంద్రరాజులు భక్తులకు క్యూలైన్ల ద్వారా దర్శనాన్ని కల్పించారు. లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తన సిబ్బందితో బందోబస్తును నిర్వహించారు. ఆలయ పూజారులు ఆదిమూలం చంద్ర, రెడ్డిశేఖర్‌లు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసి ఆలయ విశిష్టతను వివరించారు.



ప్రత్యేక అలంకరణలో అనంతపురం గంగమ్మ

సిద్దవటం : సిద్దవటం గ్రామ శివారులో వెలసిన ఇరుగులమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు ఆలయ పూజారి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ఆకుపూజ, కుంకుమార్చన, సహస్రనామార్చనలు చేసినట్టు పేర్కొన్నారు. భక్తులు బోనాలు సమర్పించి మొక్కుబడులను చెల్లించారు. భక్తులకు చెన్నారెడ్డి కుటుంబీకులు అన్నదానం ఏర్పాటు చేశారు.



నల్లగంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు